సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 18 । ఏప్రిల్ । 2024



ప్రశాంత్ అంత్యక్రియలు..
ప్రశాంత్(12) అంత్యక్రియలు బుధవారం సాయంత్రం జిబ్లక్‌పల్లి గ్రామంలో అశ్రు నయనాల నడుమ జరిగాయి. -8లో



క్షుద్ర పూజల కలకలం
గుండాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు పసుపు పోసి పూజలు చేశారు. -8లో

గరిష్టం / కనిష్టం
$42^0 / 26^0$

వాతావరణం
పగటిపూట ఉష్ణోగ్రత అధికం, మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నారసింహుడికి నిత్యారాధనలు



ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు చేసి హారతి ఇస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువ జామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు.. స్వయంభూ, ప్రతిష్టా అలంకార మూర్తులకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం అర్చన, అభిషేకం చేశారు. ఇక ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం , బ్రహ్మోత్సవం తదితర పూజలు గావించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.

డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం



గొంగిడి మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న సింగిల్‌విండో చైర్మన్లు

చౌటుప్పల్ : ఢిల్లీలో జాతీయ అవార్డు అందుకున్న డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిని జిల్లాలోని సింగిల్ విండో చైర్మన్లు బుధవారం కలిశారు. సహకార బ్యాంకుల ద్వారా రైతులకు ఉత్తమ సేవలు అందజేసి జాతీయ స్థాయిలో అవార్డు సాధించినందుకు గాను ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్‌లు చింతల దామోదర్‌రెడ్డి, కందాటి భూపాల్‌రెడ్డి, జక్కిడి జంగారెడ్డి, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు డిల్లీ మాధవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన మామిడి ధరలు



రామన్నపేట : వేసవి కాలంలో ప్రజలకు సరసమైన ధరలకు అందుబాటులోకి వచ్చే పండ్లలో మామిడి ప్రధానమైనవి. ఈ ఏడాది కరువు పరిస్థితుల ప్రభావం, కోతుల బెడద మూలంగా మామిడి దిగుబడి గణనీయంగా పడిపోయింది. దీంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. గత ఏడాది ఇదే సీజన్‌లో మేలు రకం పండ్లు మార్కెట్‌లో కిలో రూ.50కి లభించాయి. ఇప్పుడు రూ.100 పలుకుతున్నాయి. హోల్ సేల్‌గా కొనుగోలు చేస్తే రూ.90 నుంచి రూ.95 పడుతుందని, పెరిగిన ధరలతో బేరాలు చేయలేక పోతున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భువనగిరి గడ్డపై ఎర్రజెండా ఎగరాలి

నకిరేకల్ : తెలంగాణలో సీపీఎం పోటీ చేస్తున్న ఏకైక స్థానం భువనగిరి గడ్డపై ఎర్రజెండా ఎగరాలని, అందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. నకిరేకల్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించిన మేనిఫెస్టో ఒక రకంగా ఉంటుందని.. అధికారంలోకి వచ్చాక మరోలా ఉంటుందని విమర్శించారు. ఈనెల 19 సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్ నామినేషన్ దాఖలు చేయనున్నారని. పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల అలుపెరగని పోరాటాలు చేసిన ఘనత సీపీఎందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు తుమ్మల వీరారెడ్డి, కందాల ప్రమీల, బొజ్జ సుందర్, రాచకొండ వెంకట్‌గౌడ్, వంటెపాక వెంకటేశ్వర్లు, కృష్ణ, ఏర్పుల తాజ్వేశ్వర్ పాల్గొన్నారు.

• కమనీయం.. సీతారాముల కల్యాణం



యాదాద్రిలో బుధవారం సీతారాముల కల్యాణంలో భాగంగా మంగళసూత్రం చూపుతున్న అర్చకులు



చౌటుప్పల్ పట్టణంలో శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణానికి హాజరైన భక్తులు

ఎమర్జెన్సీ మోటార్ల ట్రయల్ రన్



ట్రయల్ రన్ ద్వారా అప్రోచ్ కెనాల్‌కు నీటిని వదులుతున్న దృశ్యం

పెద్దఅడిశర్లపల్లి: నాగార్జునసాగర్‌లో నీరు అడుగంటడంతో.. హైదరాబాద్ మహానగరానికి తాగునీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ మోటార్లను బుధవారం హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. జంట నగరాల దాహార్తి తీర్చేందుకు జలమండలి ఆధ్వర్యంలో రూ.3 కోట్ల వ్యయంతో పది మోటార్లు బిగిస్తున్నారు. 120 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న మోటార్లు ఐదు, 60 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న ఐదు మోటార్లతో 900 క్యూసెక్కుల నీటిని తరలించేందుకు ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. బుధవారం 60 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న4 మోటార్లకు ట్రయల్ రన్ నిర్వహించామని, మరో రెండు రోజుల్లో పది మోటార్ల ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు డీఈ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

నేటి నుంచి నామినేషన్లు





కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయం, హెల్ప్ డెస్క్

25వ తేదీ వరకు ప్రక్రియ
- ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ
- భువనగిరి కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి
- భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 18,04,930 మంది ఓటర్లు

సాక్షి, యాదాద్రి : సార్వత్రిక సమరంలో కీలక ఘట్టానికి తెరలేవనుంది. గురువారం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండగా.. అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ కేంద్రమైన భువనగిరి కలెక్టరేట్‌లో నామినేషన్లు స్వీకరించనున్నారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఇందుకు సంబంధించి యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. కాగా ఈనెల 21న ప్రభుత్వ సెలవు కావడంతో నామినేషన్ల స్వీకరణ ఉండదని ఎన్నికల అధికారులు తెలిపారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటుంది.

అభ్యర్థి నాలుగు సెట్లు దాఖలు చేయవచ్చు
ఈనెల 25వ తేదీ వరకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడానికి అవకాశం ఉంటుంది. కాగా పలువురు అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. కొందరు నేతలు ముహూర్తం చూసుకొని నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. అయితే ఒక అభ్యర్థి గరిష్టంగా నాలుగు సెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చు. అభ్యర్థులు ఫామ్–26 ప్రకారం అఫిడవిట్‌లో విద్యార్హతలు, కేసులు, క్రిమినల్ కేసులు, ఆస్తులు, అప్పుల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి.

డిపాజిట్ ఇలా..
లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు జనరల్ కేటగిరీ రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.12,500 సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. రిజర్వ్ కేటగిరీ అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. బరిలో నిలిచే అభ్యర్థి 25 సంవత్సరాలు నిండి భారతీయుడై ఉండాలి. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులను ఒకరు, గుర్తింపు పొందని రాజకీయ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులను అదే నియోజకవర్గానికి చెందిన పది మంది ప్రతిపాదించాలి. ఎన్నికల ఖర్చుకు సంబంధించి ఏదైనా జాతీయ బ్యాంకులో అభ్యర్థి తన పేను ఖాతా తీయాలి. నామినేషన్ వేయడానికి ముందు ఎన్నికల అధికారికి బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించాల్సి ఉంటుంది.

100 మీటర్ల నిబంధన ..నామినేషన్ల సందర్భంగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలో ఇతరులకు అనుమతి ఉండదు. నామినేషన్ సమర్పించేందుకు రిటర్నింగ్ అధికారి హాల్‌లోకి అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే అనుమతిస్తారు. అదే విధంగా మూడు వాహనాలకు అనుమతి ఉంటుంది. నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు. సెంట్రల్, ఆర్ముడు, సివిల్ ఫోర్సుతో మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నారు.

భువనగిరి ఎంపీ స్థానంలో ఓటర్లు ఇలా..
భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లు ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల్లో మొత్తం 18,04, 930 మంది ఓటర్లు నమోదై ఉన్నారు. ఇందులో పురుషులు 8,96,219, మహిళలు 9,08,632, ఇతరులు 79 మంది ఉన్నారు. అయితే పురుషుల కంటే మహిళా ఓటర్లు 12,413 మంది అధికంగా ఉన్నారు.

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఇబ్రహీంపట్నం	1,70,384	1,68,066	35	3,38,485
మునుగోడు	1,28,100	1,29,171	03	2,57,274
భువనగిరి	1,08,711	1,11,675	01	2,20,387
నకిరేకల్(ఎస్సీ)	1,25,323	1,28,169	04	2,53,496
తుంగతుర్తి(ఎస్సీ)	1,28,632	1,30,415	07	2,59,054
ఆలేరు	1,16,788	1,18,166	19	2,34,973
జనగామ	1,18,281	1,22,970	10	2,41,261
మొత్తం	8,96,219	9,08,632	79	1,804,930

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి
నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోని ఏఆర్‌ఓ సెంటర్లలోనూ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఎవరైనా ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిసే సీ–విజిల్ యాప్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సంబంధిత యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్లలో డౌన్ చేసుకోవచ్చన్నారు. పారదర్శక ఎన్నికల నిర్వహణ కోసం సీ–విజిల్ యాప్‌ను అందరూ తమ బాధ్యతగా భావించాలని కోరారు. తనిఖీల్లో భాగంగా భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల పరిధిలో ఇప్పటి వరకు రూ.70.32లక్షలు సీజ్ చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వెల్లడించారు.

మీడియా కీలకపాత్ర పోషించాలి

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే



మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

భువనగిరిటౌన్ : ప్రశాంతమైన వాతావరణలో ఎన్నికలు నిర్వహణకు మీడియా కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ హనుమంతు కే.జండగే కోరారు. కలెక్టరేట్‌లో మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ)ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అందింజేసేందుకు మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సోషల్ మీడియాలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రకటనలను సకాలంలో ఆమోదిస్తూ అనుమతి ఇవ్వాలని పేర్కొన్నారు. శాటిలైట్ చానళ్లలో వచ్చే వార్తలను పూర్తిస్థాయిలో రికార్డు చేయాలని స్పష్టం చేశారు. వార్తా పత్రికలు, ఈ–పేపర్లు, టెలివిజన్ చానళ్లు, కేబుల్ నెట్‌వర్క్, సోషల్ మీడియా, మూవీ హాస్‌లు, ఇతర ఆడియో, వీడియో విజువల్స్‌తో ఎంసీఎంసీ నుంచి అనుమతి పొందిన తర్వాతే ప్రకటనలను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.బెన్‌షాలోమ్, గంగాధర్, డీపీఆర్‌ఓ వెంకటేశ్వరావు ఉన్నారు.

విద్యార్థుల పర్యవేణకు అధికారుల నియామకం
భువనగిరిటౌన్ : భువనగిరిలోని గురుకుల హాస్టల్‌లో అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి అధికారులను నియమించినట్లు కలెక్టర్ హనుమంతుకే.జెండగే తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీ, మిరాకిల్ ఆస్పత్రుల్లో తుర్కపల్లి తహసీల్దార్ దేశ్యా, ఉస్మానియా, బంజారాహిల్స్ రెయిన్‌బోలో పోచంపల్లి తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, భువనగిరి ఏరియా ఆస్పత్రిలో భువనగిరి తహసీల్దార్ అంజిరెడ్డిని పర్యవేక్షణకోసం నియమించిన్నట్లు తెలిపారు. చౌటుప్పల్ ఆర్డీఓను రెయిన్‌బో హాస్పిటల్‌లో ప్రశాంత్ అనే విద్యార్థి కోసం ప్రత్యేకంగా నియమించామన్నారు. ఉస్మానియాలో మెడికల్ ఆఫీసర్ విజయ్, గాంధీలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యశోద చూస్తున్నారు.

సీఎంను కలిసిన అయ్యాడపు రవీందర్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అయ్యాడపు రవీందర్‌రెడ్డి, చిత్రంలో బార్ అసోసియేషన్ సభ్యులు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యాడపు రవీందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసానికి బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా న్యాయవాదులకు సంబంధించిన పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. అందుకు ముఖ్యమంత్రి నుంచి సానుకూల స్పందన లభించిందని రవీందర్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రితో పాటు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఉన్నారు.

మళ్లీ భానుడి భగభగలు



నిర్మానుష్యంగా భువనగిరి ప్రధాన రహదారి

- యాదగిరిగుట్టలో 44.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు
- మిగతా అన్ని మండలాల్లోనూ 41 డిగ్రీలకు పైనే...
- వడగాలులతో అల్లాడుతున్న జనం

భువనగిరిటౌన్ : జిల్లాలో భానుడు మళ్లీ నిప్పులు కక్కుతున్నాడు. ఈనెల 12న 33.4 డిగ్రీలు, 13 తేదీన 34 డిగ్రీలు నమోదు కాగా.. బుధవారం జిల్లా వ్యాప్తంగా 41 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు రికార్డ్ అయ్యాయి. అత్యధికంగా యాదగిరిగుట్టలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8 నుంచే ఎండ తీవ్రత పెరగడంతో జనం అల్లాడుతున్నారు.

నిర్మానుష్యంగా రహదారులు
ఎండ తీవ్ర వల్ల రోడ్లపై జన సంచారం తగ్గింది. యాదాద్రి క్షేత్రానికి సైతం భక్తుల రాక తగ్గింది. ఆలయ పరిసరాలు, ఘాట్ దారి బోసిబోయి కనిపించాయి. నిత్యం రద్దీగా ఉండే యాదగిరిగుట్ట పట్టణ రహదారులు వెలవెలబోయాయి. అత్యవసర పనులు ఉన్నవారే బయటకు వస్తున్నారు. ఎండ వేడిమికి ఫ్యాన్లు, కూలర్ల నుంచి వేడిగాలి వస్తోంది. చిన్నపిల్లలు, వృద్ధుల పరిస్థితి దారుణంగా మారుతోంది. మూగ జీవాలు ఎక్కడ నీడ కనిపిస్తే అక్కడే సేదతీరుతున్నాయి. దినసరి కూలీలు, కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. పని ప్రదేశాల్లో ఎక్కువ సేపు పనిచేయలేక నీరసించిపోతున్నారు. ప్రధానంగా భవన నిర్మాణ రంగం, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులపై ఎండదెబ్బ పడుతోంది. రోడ్లపై జన సంచారం తగ్గిపోవడంతో చిరువ్యాపారులు దివాలా తీస్తున్నారు.



భక్తులు లేక బోసిబోయిన యాదాద్రి ఆలయ మాడ వీధి

బుధవారం నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

గ్రామం	ఉష్ణోగ్రత		
యాదగిరిగుట్ట	44.6	నారాయణపురం	42.3
వలిగొండ	43.4	భువనగిరి	42.2
గొలనుకొండ	43.3	జలాల్‌పురం	41.8
మర్యాల	43.2	గుండాల	41.7
బుజిలాపురం	42.8	మోటకొండూరు	41.7
చౌటుప్పల్	42.7	రాజాపేట	41.7
రామన్నపేట	42.6	వెంకిర్యాల	41.7

గురుకుల విద్యార్థులు ఇంటిబాట

- భువనగిరి గురుకులంలో జరిగిన ఘటనతో భయాందోళన
- తమ పిల్లలను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు
- అధికారులు నచ్చజెప్పినా ససేమిరా..
- ప్రశ్నార్థకంగా పరీక్షలు



కుమారున్ని తీసుకువెళ్తున్న తండ్రి



తీసుకెళ్ల వద్దని తల్లిదండ్రులకు నచ్చజెబుతున్న అధికారులు

భువనగిరి క్రైం : భువనగిరి పట్టణంలోని గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురవడం.. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సీహెచ్ ప్రశాంత్ (12) అనే విద్యార్థి మృతి చెందడం మరింత ఆందోళనకు గురయ్యారు. దీంతో తల్లిదండ్రులు హాస్టల్‌కు వచ్చి తమ పిల్లల తీసుకెళ్తున్నారు. పరీక్షలు ఉన్నాయని అధికారులు సర్దిచెబుతున్నా వినడం లేదు. బుధవారం ఒక్క రోజే సుమారు 100 మంది విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు.

పరీక్షలు ఎలా?
1నుంచి 9వ తరగతి వరకు ఈ నెల 15 నుంచి వార్షిక పరీక్షలు మొదలయ్యాయి. ఈనెల 22వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఇప్పటివరకు రెండు పరీక్షలు పూర్తయ్యాయి. విద్యార్థులంతా ఇళ్లకు వెళ్లిపోతుండడంతో మిగితా పరీక్షలు ఎలా నిర్వహిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. వారికి మళ్లీ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. హాస్టళ్లలో సరైన వసతులు కల్పించాలని, నాణ్యతతో కూడిన భోజనం అందించాలని, ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కోరారు.

చికిత్స పొందుతున్న విద్యార్థులు
కలుషిత ఆహారం తిని 28 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికాగా భువనగిరి ఏరియా ఆస్పత్రిలో ఐదుగురు విద్యార్థులు చికిత్స పొందుతున్నారు. గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో మరో 8 మంది ఉన్నారు. వారి ఆరోగ్యం నిలకడగానే ఉందని అధికారులు తెపారు.

పూర్తిస్థాయి విచారణ చేయించాలి
భువనగిరి టౌన్ : భువనగిరిలోని గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై మృతి చెందిన విద్యార్థి ప్రశాంత్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ బుధవారం దళిత, ప్రజా సంఘాల నాయకులు కలెక్టర్ హనుమంతు కే.జెండగేకు వినతిపత్రం అందజేశారు.అధికారుల పర్యవేక్షణ లోపంవల్లే ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందజేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు బట్టు రామచంద్రయ్య, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సురుపంగ శివలింగం, దళిత ఐక్యవేదిక జిల్లా నాయకులు శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ పాల్గొన్నారు.

న్యాయ విచారణకు ఆదేశించాలి



భువనగిరిలోని గురుకుల హాస్టల్ ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించాలి. మృతుని కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలి. హాస్టళ్లలో పరిశుభ్రత పాటించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. వార్డెన్‌లు హాస్టళ్లలోనే ఉంటూ విద్యార్థుల బాగోగులను పట్టించుకోవాలి.

– పల్లగొర్ల రాందేవ్, బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఆర్‌సీఓను సస్పెండ్ చేయాలి



హాస్టల్‌లో 28 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనా తక్షణమే స్పందించకుండా నిర్లక్ష్యవైఖరి వహించిన ఆర్‌సీఓను సస్పెండ్ చేయాలి. హాస్టల్‌లో మౌలిక వసతులు సరిగ్గా లేక విద్యార్థులు ఇబ్బందులకు గురైన అధికారులు పట్టించుకోలేదు. హాస్టళ్లలో విద్యార్థులకు వారానికి ఒక సారి వైద్య పరీక్షలు నిర్వహించాలి.

– లావద్య రాజు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

కనగల్: మండల పరిధిలోని పర్వతగిరి గ్రామంలో మంగళవారం సాయంత్రం యువతి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చనగాని కావ్య (20) గత రెండు సంవత్సరాలుగా ఫిట్స్‌తో బాధపడుతోంది. తీవ్ర మనోవేదనకు గురై మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకుంది. సోదరుడు నవీన్ ఇంటికి వచ్చి కావ్యను గమనించి, నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కావ్య తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

చనగాని కావ్య

విద్యుదాఘాతంలో మహిళ మృతి

రాజాపేట: మండలంలోని కాల్వపల్లి గ్రామంలో బుధవారం విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకల్ల ఐలయ్య, చంద్రకళ దంపతులు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం చంద్రకళ (55) బట్టలు ఉతికేందుకు నీటికోసం విద్యుత్ మోటార్ ఆన్‌చేయగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. పక్కనే ఉన్న వారు గమనించి, వచ్చి చూసేసరికి విద్యుత్ షాక్ తగిలి కిందపడిపోయి ఉండడంతో ఇంట్లో నిద్రిస్తున్న భర్తకు సమాచారం తెలియజేశారు. చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చంద్రకళ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించగా ఏరియా ఆస్పత్రికి చేరుకుని పంచనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బొలేరో వాహనంలో మంటలు

- డ్రైవర్‌కు తప్పిన ప్రమాదం

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని అశోక్‌నగర్ మీదుగా వెళ్తున్న బొలేరో వాహనంలో మంటలు చెలరేగాయి. ఇంజన్ నుంచి ఒక్కసారిగా పొగలు రావడంతో గమనించిన డ్రైవర్ అప్రమత్తమై కిందకు దిగాడు. గమనించిన స్థానికులు వాహనం ఇంజన్ డోర్‌ను బలవంతంగా తెరిచి చూడగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వారు అప్రమత్తమై వాహనం మొత్తానికి మంటలు వ్యాపించకుండా వెంటనే ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వాహనం థర్మల్ ప్లాంట్‌కు చెందినదని స్థానికులు తెలిపారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

పెద్దవూర: రేషన్ బియ్యం నిల్వలో తేడాలు ఉండడంతో గుర్రంపోడు మండలం గాసిరాంతండా రేషన్ డీలర్‌పై కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ ఆర్‌ఐ హబీబ్ తెలిపారు. గురువారం పెద్దవూర మండలంలోని గాసిరాంతండాలో రేషన్ దుకాణాన్ని ఆయన తనిఖీ చేసి, బియ్యం నిల్వలో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం డీలర్ మేగావత్ లక్ష్మీపై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రేషన్ దుకాణాల డీలర్లు బియ్యం పంపిణీలో నిర్లక్ష్యం వహించినా, కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి పక్కదారి పట్టించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మండు వేసవిలో జలకళ

భూదాన్‌పోచంపల్లి: మండు వేసవిలో భూదాన్‌పోచంపల్లి మండలంలోని చెరువులు మత్తడి దూకుతున్నాయి. మూసీ పరీవాహకంలో వరికోతలు ముమ్మరంగా జరుగుతుండడంతో పంటకు నీరు అవసరం ఉండదు. దీంతో చెరువు కింద ఉన్న ఆయకట్టుకు నీటి సరఫరా నిలిపివేశారు. ఎగువ నుంచి కాలువల ద్వారా మూసీనీరు వచ్చి చేరుతుండటంతో పోచంపల్లి, రేవనపల్లి, శివారెడ్డిగూడెం, ఇంద్రియాల చెరువులు నిండాయి. రెండు రోజులుగా పోచంపల్లి, రేవనపల్లి చెరువులు మత్తడి దూకుతున్నాయి.



అలుగు పోస్తున్న రేవనపల్లి చెరువు



జలసిరితో పోచంపల్లి చెరువు



మత్తడి దూకుతున్న పోచంపల్లి చెరువు

దాతలూ.. ఆదుకోండి

- రోడ్డు ప్రమాదంలో కుమారుడి కన్నుకు గాయం
- తలకు, ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్
- ఆపరేషన్ చేసి కన్ను తీసివేసిన వైద్యులు
- వైద్యానికి ఇప్పటికే రూ.20 లక్షలు ఖర్చు
- నిరుపేద కుటుంబం కావడంతో ఆపన్నహస్తం కోసం వేడుకోలు

కన్నీటి గాథ

చిలుకూరు: వారిది నిరుపేద కుటుంబం. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. ఈ కుటుంబానికి అనుకోకుండా పెద్ద విపత్తు జరిగింది. దీంతో ఒక్కసారిగా ఆ కుటుంబం కష్టంలో పడింది. చిలుకూరు మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన గోపిదేశి వీరబాబు, వెంకటనర్సమ్మకు కుమారుడు ప్రవీణ్ ఉన్నాడు. వీరికి కేవలం 10 గుంటల భూమి ఉంది. వీరబాబు 20 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వెంకటనర్సమ్మ గ్రామ శివారులో ఉన్న గోదాంలో స్వీపర్‌గా పని చేస్తుంది. ఆమె కుమారుడు ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. తల్లి, కుమారుడు ఇద్దరూ కూలీ పనికి వెళ్తూ జీవనం సాగిస్తున్నారు.



హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోపిదేశి ప్రవీణ్

ఇంకా రూ.10లక్షలు అవసరం..

గత నెల మార్చి 31న ప్రవీణ్ పని నిమిత్తం కోదాడకు వెళ్లి అనంతరం కోదాడ నుంచి చిలుకూరు మీదుగా స్వగ్రామమైన సీతారాంపురానికి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో చిలుకూరు వద్ద కారు ఢీ కొని అతడి ఎడమ కన్నుకు తీవ్రంగా గాయమైంది. దీంతో వైద్యులు ఆ కన్నును ఆపరేషన్ చేసి తీసేసారు. కన్ను పూర్తిగా దెబ్బతినడంతో కన్ను ద్వారా తలకు, ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్ వచ్చింది. వైద్యానికి మొత్తం రూ.20 లక్షలు ఖర్చు వస్తుందని వైద్యులు తెలిపారు. తన కొడుకును కాపాడుకునేందుకు తనకు ఉన్న 10 గుంటల భూమిని అమ్మగా వచ్చిన రూ.10 లక్షలు ఆస్పత్రిలో చెల్లించింది. ఇంకా రూ.10లక్షల వరకు అవసరం ఉంది. ప్రస్తుతం అప్పు తీసుకువచ్చి కుమారుడికి వైద్యం చేయిస్తోంది. ఆర్థికంగా స్థోమత లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ఆర్థిక సాయం చేయాల్సిన వారు

గన్నా అన్వేష్
అకౌంట్ నంబర్: 50100513510692
ఐఎఫ్‌సీ కోడ్: హెచ్‌డీఎఫ్‌సీ0001642
బ్రాంచ్ : కోదాడ
ఫోన్ పే లేదా గూగుల్ పే నంబర్ :
99856 26573

గ్రామస్తుల చేయూత..

ఉన్న భూమిని అమ్మినా వైద్యానికి డబ్బులు సరిపోకపోవడంతో తల్లి అప్పులు చేసి వైద్యం చేయిస్తోంది. విషయం తెలుసుకున్న పలువురు గ్రామస్తులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో కొంత మంది ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. మరికొంత మంది చేయూతనందిస్తే తన కుమారుడి ఆరోగ్యం నయం అవుతుందని తల్లి వెంకటనర్సమ్మ పేర్కొంది. తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతోంది.

బ్యాంకులో రూ.15.50లక్షలు మాయం

- క్యాషియర్‌పై ఫిర్యాదు చేసిన మేనేజర్

వలిగొండ: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో రూ.15.50 లక్షల నగదు మాయమైంది. బ్యాంకులో క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్న కాలేరు అనిల్ కుమార్ మంగళవారం ఉదయం 10 గంటలకు విధులకు హాజరయ్యాడు. 11 గంటల సమయంలో బ్యాంక్ అధికారులకు ఎలాంటి సమాచారమూ ఇవ్వకుండా బ్యాంక్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బ్యాంకు మేనేజర్ మౌనిక అనిల్ కుమార్‌కు ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. మేనేజర్‌కు అనుమానం వచ్చి బ్యాంక్ సిబ్బందితో కలిసి క్యాష్ కౌంటర్‌లోని నగదును మంగళవారం సాయంత్రం లెక్కించారు. రూ.15.50 లక్షల నగదు లెక్కలోకి రాకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించారు. బ్యాంక్ నగదుతో ఉడాయించిన క్యాషియర్ అనిల్ కుమార్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని నగదు రికవరీ చేయాలని బ్యాంక్ మేనేజర్ మౌనిక బుధవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్‌లాల్ తెలిపారు.

వైభవంగా శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఉదయమే శివాలయాన్ని తెరిచిన అర్చకులు విశేష పూజలు జరిపించారు. అనంతరం శ్రీసీతారామచంద్రస్వామిని ప్రత్యేకంగా అలంకరించి సేవను ఊరేగించారు. యాదాద్రీశుడి దేవాలయం తరపున అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి దంపతులు, ఈఓ భాస్కర్‌రావు, ఆలయ అధికారులు, ఆచార్యులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం శివాలయం ఉత్తర దిశలోని కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణ వేడుక నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం 12.30గంటలకు శ్రీసీతారామచంద్రస్వామికి పట్టాభిషేకం జరిపించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆయా వేడుకల్లో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



శ్రీసీతారామచంద్రస్వామికి ముత్యాల తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

డిండి: మండల పరిధిలోని చెర్కుపల్లి స్టేజీ సమీపంలో అనుమతులు లేకుండా తరలిస్తున్న 22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్ పట్టుకున్నారు. చందంపేట మండలం నలచెరుముల గ్రామానికి చెందిన ముత్యాలు బొలేరో వాహనంలో 22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లోడ్ చేసుకొని చెర్కుపల్లి స్టేజీ సమీపంలోని ఓ రైస్ మిల్లులో తూకం వేస్తున్నాడు. అప్పటికే సమాచారం అందుకున్న డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్ దాడి చేసి బియ్యాన్ని పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యంతోపాటు వాహనాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. వినియోగదారుల నుంచి రేషన్ డీలర్లు, దళారులు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేయొద్దని, అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందితే 98488 49126 నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు.



పట్టుబడిన పీడీఎస్ బియ్యం

ప్రశాంత్‌కు కన్నీటి వీడ్కోలు

భూదాన్‌పోచంపల్లి: కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన ఘటనలో చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థి చిన్నలచ్చి ప్రశాంత్(12) అంత్యక్రియలు బుధవారం సాయంత్రం జిబ్లక్‌పల్లిలో అశ్రునయనాల నడుమ జరిగాయి. ప్రశాంత్ బంజారాహిల్స్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో మంగళవారం రాత్రి మృతి చెందగా, అదేరోజు రాత్రి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బుధవారం సాయంత్రం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని జిబ్లక్‌పల్లికి తీసుకువచ్చారు. అప్పటికే మృతుడి ఇంటి వద్దకు గ్రామస్తులు, మృతుడి బంధువులు, వివిధ పార్టీల నాయకులు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోచంపల్లి, నారాయణపురం ఎస్‌ఐలు భాస్కర్‌రెడ్డి, జగన్ ఆధ్వర్యంలో 30 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు అంతిమ సంస్కారాలు నిర్వహించారు.



ప్రశాంత్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే అండ...

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అండగా ఉంటారని డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్ తెలిపారు. వారు బుధవారం గాంధీ ఆస్పత్రికి చేరుకుని, మృతుడి తల్లిదండ్రులు, బంధువులతో మాట్లాడారు. ఎమ్మెల్యే రూ. 4లక్షల ఆర్థిక సాయంతోపాటు ఇందిరమ్మ ఇల్లు, బాధిత కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ ఉద్యోగం, ప్రైవేట్ ఆస్పత్రిలో అయిన ఖర్చు చెల్లిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం.. అంతిమ సంస్కారాల నిమిత్తం చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి రూ. 20వేల ఆర్థికసాయం బాధిత కుటుంబానికి అందజేశారు.

డీసీసీబీ చైర్మన్‌ను అభినందించిన కేసీఆర్



మహేందర్‌రెడ్డిని అభినందిస్తున్న కేసీఆర్, చిత్రంలో మదర్ డెయిరీ చైర్మన్, పలువురు పీఏసీఎస్ చైర్మన్లు

నల్లగొండ టౌన్, యాదగిరిగుట్ట : జాతీయ స్థాయిలో ఉత్తమ డీసీసీబీ చైర్మన్‌గా ఇటీవల అవార్డు అందుకున్న నల్లగొండ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిని బుధవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందించారు. అవార్డు అందుకున్న గొంగిడి మహేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన ఫాంహౌస్‌లో కలిశారు. నష్టాల్లో ఉన్న బ్యాంకును లాభాల దిశగా ముందుకు తీసుకుపోయి దేశంలోని 540 డీసీసీబీల్లో ఉత్తమ చైర్మన్లుగా ఎంపికైన ఐదుగురిలో మహేందర్‌రెడ్డి ఉండటం తెలంగాణకు గర్వకారణమన్నారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు చింతల దామోదర్‌రెడ్డి, ఎం.మల్లేష్‌గౌడ్, ఎస్.పరమేశ్‌రెడ్డి, ఇ.రాంరెడ్డి, బాల నర్సయ్య, ఎస్.నర్సింహారెడ్డి, చింతలపూడి భాస్కర్‌రెడ్డి, జంగారెడ్డి, భూపాల్‌రెడ్డి, గుండాల వైస్ చైర్మన్ పురుగుల మల్లేష్‌యాదవ్, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఢిల్లి మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

చింతపల్లి: తెలుగు పరీక్ష సరిగ్గా రాయలేదన్న సాకుతో ఉపాధ్యాయుడు విద్యార్థిని తీవ్రంగా కొట్టిన సంఘటన చింతపల్లి మండల కేంద్రంలోని మాతశ్రీ పాఠశాలలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాంపల్లి మండలంలోని తుంగపాడు గ్రామానికి చెందిన బొడ్డుపల్లి త్రిశూల్ చింతపల్లిలోని మాతశ్రీ ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. తెలుగు పరీక్ష సరిగ్గా రాయలేదన్న కారణంతో ఉపాధ్యాయుడు కర్రతో కొట్టడంతో బాలుడి ఒంటిపై వాతలు పడ్డాయి. బుధవారం బాలుడి తాత గమనించడంతో ఉపాధ్యాయుడు కొట్టిన విషయం బయటపడింది. ఈ సంఘటనపై ప్రిన్సిపాల్ అంజన్‌గౌడ్ స్పందిస్తూ సంబంధిత ఉపాధ్యాయుడిని విధుల్లో నుంచి తొలగించినట్లు తెలిపారు.



ఉపాధ్యాయుడు కొట్టడంతో చేతిపై వచ్చిన వాతలు

సిద్ధాపురంలో అగ్ని ప్రమాదం

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల పరిధి సిద్ధాపురంలో బుధవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామానికి సమీపంలో వరి పైరు మొదళ్లను కాలుస్తున్న క్రమంలో నిప్పురవ్వలు ఇళ్లల్లోకి వచ్చి పడ్డాయి. దీంతో ఇంటి ఎదుట ఉన్న కొబ్బరి చెట్లు కాలిపోతుండగా ఫైరింజన్ సిబ్బంది అక్కడకు వచ్చి మంటలు ఆర్పివేశారు. ఎస్‌ఐ నాగరాజు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

కమెడియన్ రఘుబాబు కారు ఢీకొని
బీఆర్‌ఎస్ నాయకుడి మృతి

- నల్లగొండ పట్టణంలోని లెప్రసీ కాలనీ వద్ద ఘటన
- రఘుబాబుపై కేసు నమోదు

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణ సమీపంలోని లెప్రసీ కాలనీ వద్ద నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ పట్టణ కార్యదర్శి సందినేని జనార్దన్‌రావు (48) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రత్యక్ష సాక్షులు, కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలం మంగలపల్లి గ్రామానికి చెందిన జనార్దన్‌రావు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ నల్లగొండలో స్థిరపడ్డాడు. బుధవారం సాయంత్రం లెప్రసీ కాలనీ వద్ద వెంచర్‌లో వాకింగ్ చేసి, బైక్‌పై నల్లగొండ పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి వస్తున్నాడు. లెప్రసీ కాలనీ వద్ద రోడ్డు దాటుతుండగా.. హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వైపు బీఎండబ్ల్యూ కారులో వెళ్తున్న హాస్య నటుడు రఘుబాబు వేగంగా వచ్చి ఇతడి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో జనార్దన్‌రావు మొదట కారు అద్దంపై పడి, ఆ తర్వాత ఎగిరి 100 మీటర్ల దూరంలో పడ్డాడు. బైక్ కారు ఇంజన్‌లో ఇరుక్కుపోయింది. జనార్దన్‌రావు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలో ఉన్న వారు గమనించి, కమెడియన్ రఘుబాబుతో వాగ్వాదానికి దిగారు. అనంతరం టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకున్నారు. రఘుబాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జనార్దన్‌రావు మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య నాగమణి, కుమార్తె ఝాన్సీ, కుమారుడు భరత్ ఉన్నారు. కుమార్తె ఇటీవల సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరగా, కుమారుడు బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. కమెడియన్ రఘుబాబు అజాగ్రత్తగా కారు నడిపి తన భర్త మృతికి కారణమయ్యాడని నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.



రఘుబాబుతో వాగ్వాదానికి దిగిన స్థానికులు



బైక్‌ను ఢీకొన్న కారు



జనార్దన్‌రావు (ఫైల్)

పలువురి సంతాపం..

జనార్దన్‌రావు మృతి పట్ల బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సైదిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, మారగోని గణేష్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు దేప వెంకటరెడ్డి, ఐతగోని యాదయ్యగౌడ్, పలువురు వ్యాపారవేత్తలు సంతాపం తెలిపారు.

క్షుద్రపూజల కలకలం

గుండాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పసుపు పోసి, మధ్యలో ఆకులు, పువ్వులు వేసి ఉండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. బుధవారం ఉదయం గమనించిన స్థానికులు ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పసుపు, ఆకులు తొలగించి శుభ్రం చేయించారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వంగ సాగులో తెగుళ్లు, నివారణ చర్యలు

పాడి పంట

నడిగూడెం: వేసవి కాలంలో వంగ(వంకాయ) సాగు చేసే రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చని హార్టికల్చర్ కన్సల్టెంట్ షేక్ ఇస్మాయిల్ చెబుతున్నారు. వంగ పంటకు తొలి దశ నుంచి ఆశించే పురుగులు, సోకే తెగుళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..



షేక్ ఇస్మాయిల్, హార్టికల్చర్ కన్సల్టెంట్



సాగులో ఉన్న వంగ పంట

1. మొవ్వు, కాయతొలుచు పురుగు: వంగ నారు నాటిన 30–40 రోజుల నుంచి ఈ పురుగు ఆశిస్తుంది. ఈ పురుగు మొక్క పెరుగుదల దశలో మొవ్వును, తర్వాత దశలో కాయలను తొలిచి నష్టాన్ని కలుగచేస్తుంది. కాయలు వంకర్లు తిరిగిపోతాయి. కొమ్మల చివర్ల పెరుగుదల ఆగిపోతుంది. దీని నివారణకు ఆశించిన కొమ్మలను తుంచివేయాలి. తొలిదశలో వేప నూనె లీటరు నీటికి 5మి.లీ. లేదా కార్బరిల్ 50 శాతం 3గ్రాములు, లీటరు నీటికి, లేదా ప్రొఫెనోఫాస్ 2.మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

2. రసం పీల్చే పురుగులు (దీపపు పురుగులు, పేనుబంక, తెల్లదోమ): ఈ పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి, రసాన్ని పీల్చివేయడం వలన ఆకులు పసుపు రంగుకు మారి, పైకి ముడుచుకొని ఎండిపోతాయి. వీటి నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్‌డెమటాన్ లేదా ఫిప్రోనిల్ లీటరు నీటికి 2మి.లీ. చొప్పున పిచికారీ చేయాలి.

3. ఎర్రనల్లి: ఆకుల అడుగుభాగాన చేరి, రసం పీల్చడం వలన ఆకులు పాలిపోయి తెల్లగా మారుతాయి. ఆకులపై సాలెగూడు వంటి తీగలు ఏర్పడతాయి. దీని నివారణకు లీటరు నీటికి నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా డైకోఫాల్ 5మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

4. ఆకుమాడు తెగులు: వంగ నారును పొలంలో నాటిన తర్వాత 30 రోజులకు ఈ తెగులు ఆశిస్తుంది. ఆకులన్నీ మాడిపోయినట్లుగా కనిపిస్తాయి. ఈ తెగులు ఆశించినపుడు ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. తర్వాత పసుపురంగుకు మారి వాడి రాలిపోతాయి. తేమతో కూడిన చల్లని వాతావరణంలో ఈ తెగులు ఎక్కువగా కన్పిస్తుంది. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా మాంకోజెబ్ 2.5 గ్రాములు, లేదా కార్బెండిజమ్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2సార్లు పిచికారీ చేయాలి.

5. ఆకుమాడు, కాయకుళ్లు తెగులు: ఆకులమీద అక్కడక్కడ గోధుమ రంగుతో కూడిన మచ్చలు కన్పిస్తాయి. తెగులు ఉధృతమైతే ఆకులు మాడి రాలిపోతాయి. తెగులు సోకిన కాయలు పసుపురంగుకు మారి కుళ్లిపోతాయి. దీని నివారణకు నారుమడిలో విత్తేముందు 50 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత గల వేడిలో విత్తనాలను 30నిమిషాల పాటు నానబెట్టి విత్తుకోవాలి. తెగులు సోకిన పొలంలో పంటమార్పిడి తప్పనిసరిగా పాటించాలి. కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3గ్రాముల మందును లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలి.

6. వెర్రి తెగులు: ఆకులు సన్నగా మారి, పాలిపోయిన ఆకుపచ్చని రంగు కల్గి ఉంటాయి. మొక్కలు గుబురుగా, చీపురు కట్టలా కనబడతాయి. దీని నివారణకు నారుదశలో నాటడానికి ముందు 250 గ్రాములు కార్బోఫ్యూరాన్ గుళికలను 100 చ.మీ. నారుమడికి వేయాలి. ప్రధానంగా పురుగు ఆశించిన కాయలను, కొమ్మలను తుంచి నాశనం చేయాలి. అంతరపంటలుగా బంతి, ఉల్లి, వెల్లుల్లి సాగు చేసుకోవాలి. లింగాకర్షక బుట్టలను ఎకరానికి 4 చొప్పున పెట్టాలి. తలనత్త ఆశించిన కొమ్మలను పురుగు ఆశించిన ప్రాంతం నుంచి ఒక అంగుళం కిందికి తుంచి నాశనం చేయాలి. అల్లిక రెక్కల పురుగులను మొక్కకు 2 చొప్పున పంట పెరిగే దశలో విడుదల చేయాలి. ఎకరానికి 200 కిలోల చొప్పున వేప పిండిని దుక్కిలో వేయాలి.

క్లుప్తంగా

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

భువనగిరి : కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలో ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్, బీజేపీ దళిత మోర్చా నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు సహకరించాలన్నారు. అంతకు ముందు గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థి ప్రశాంత్ ఫుడ్ పాయిజన్‌తో చికిత్స పొందుతు మృతి చెందడం పట్ల సంతాపం తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, ఎస్సీ మోర్చా, కడియం రామచంద్రయ్య, మొగులయ్య, మేడి కోటేష్, ప్రతాప్, దుబ్బ రామకృష్ణ, దేవేందర్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం



మోత్కూరు : ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

మోత్కూరు : బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని పెద్దమ్మ గుడి, గడి బజార్, అంగడిబజార్, సుందరయ్య కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు పోచం సోమయ్య దొంతి నర్సింహా రెడ్డి, జితేందర్ రెడ్డి, మల్లేష్, ఆరె శ్రీనివాస్, తిరుమలేష్, సజ్జనం మనోహర్, యాకేష్, ప్రకాష్, రమణ, దశరథ, నల్ల మాణిరెడ్డి పాల్గొన్నారు.

తుర్కపల్లి: బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని 47,48 బూత్‌లలో బుధవారం ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు రాఘవుల నరేందర్ , మండల అధ్యక్షుడు శత్రునాయక్, మేకల శ్రీనివాస్, లావణ్య, పాండు యాదవ్, శ్రీకాంత్ నాయక్, చాంద్‌పాష, రాజు పాల్గొన్నారు.

రామన్నపేట : భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం ఆ పార్టీ నాయకులు మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్రప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వనం అంజయ్య, దావనూరి వెంకటేశం, బండ మధుకర్‌రెడ్డి, ముగ్గు నర్సింహ పాల్గొన్నారు.

అడ్డగూడూరు : బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూరనర్సయ్య గౌడ్ ను గెలిపించాలని కోరుతూ బుధవారం బీజేపీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ కురాకుల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బీరు మల్లు, మరాఠి కుమార్, శంకర్, కురాకుల అరుణ, నవీన్, యాదగిరి పాల్గొన్నారు.

ఎండీ జహంగీర్‌ను గెలిపించాలి



గుండాల : ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

మోత్కూరు : ప్రజా సమస్యలపై పోరాడే సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. మండలంలోని పాలడుగు గ్రామంలో సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దడిపల్లి ప్రభాకర్, పిట్టల శంకరయ్య, సోమరాజ్, వద్దేపల్లి లక్ష్మణ్, గుంటోజు యాదయ్య, అనసూయ, గంటెపాక బుచ్చిరాములు, నర్సమ్మ, వెండి మాధవి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

గుండాల : భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని సీతారాంపురం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజు, ఎండీ.ఖలీల్, అబ్బయ్య, పెద్ద రామయ్య, అంజిరెడ్డి, రమాదేవి పాల్గొన్నారు.

రాంపల్లి లింగం గౌడ్ మృతికి పలువురి సంతాపం

భువనగిరి రూరల్ : మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ భర్త రాంపల్లి లింగం గౌడ్(70) అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని ఎంపీపీ నరాల నిర్మల వెంకటస్వామి, జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ జడల అమరేందర్ గౌడ్, మాజీ ఎంపీపీ కేశవపట్నం రమేష్ పరామర్శించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాంపల్లి కష్టాగౌడ్, కొండ స్వామి, సత్యం, మల్లికార్జున్‌శ్రీనివాస్, అశోక్ ఉన్నారు.

కమనీయం.. రాములోరి కల్యాణం

సాక్షి నెట్‌వర్క్ : జిల్లా వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలను బుధవారం వైభవోపేతంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య కనులపండువగా రాములోరి క ల్యాణం జరిపించారు. భాజాభజంత్రీలు, వేదమంత్రాలు, ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధ లతో నిర్వహించారు. పల్లె, పట్టణం ఎక్కడ చూసినా రామమయమే. శ్రీరామ.. జై రామ.. జైజై రామా.. అంటూ అంతటా శ్రీరామ నామస్మరణ మార్మోగింది. అనంతరం నిర్వహించిన అన్నదానంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



భువనగిరి : పచ్చలకట్ట సోమేశ్వరాలయంలో భక్తులకు సీతమ్మ వారి తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు



చౌటుప్పల్ : సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న పురోహితులు



సంస్థాన్ నారాయణపురం : సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



మోటకొండూర్: చాడలో..



రామన్నపేట : సిరిపురంలో తాళిబొట్టు చూపిస్తున్న అర్చకులు



వలిగొండ : తాళి బొట్టు చూపిస్తున్న వేద పండితులు



రాజాపేట : గడికోటలో..



మోత్కూరులో..



బొమ్మలరామారం : పూజలు చేస్తున్న భక్తులు



భూదాన్‌పోచంపల్లి : శివారెడ్డిగూడెంలో..



భువనగిరి రూరల్ : బొల్లెపల్లిలో..



ఆత్మకూరు(ఎం) : కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



బొమ్మలరామారం : మైలారంలో ..



రామన్నపేట : వెల్లంకిలో..



యాదగిరిగుట్ట రూరల్: మాసాయిపేటలో..



భువనగిరి : కన్యకాపరమేశ్వరాలయంలో..



రామన్నపేట : సిరిపురంలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



చౌటుప్పల్ : సీతారాముల కల్యాణోత్సవంలో తలంబ్రాలు పోస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దంపతులు



తుర్కపల్లి: రాముల వారి గుట్టపై కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



గుండాల : సీతారాంపురంలో నిర్వహించిన వేడుకల్లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



తుర్కపల్లి : పూజలు చేస్తున్న బూర నర్సయ్యగౌడ్



అడ్డగూడూరు : ఎమ్మెల్యే సామేల్‌కు సీతారాముల చిత్రపటాన్ని అందజేస్తున్న గ్రామస్తులు



ఆలేరురూరల్ : సాయిగుడెంలో శ్రీరాముడి కల్యాణం జరిపిస్తున్న పండితులు



గుండాల : సీతారాంపురంలో తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు



అడ్డగూడూరు : గట్టుంగారంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని జరిపిస్తున్న అర్చకులు



ఆత్మకూరు(ఎం) : మెయిన్ సెంటర్‌లో అన్నదానం చేస్తున్న దాతలు



భువనగిరి : కన్యకాపరమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న బూర నర్సయ్యగౌడ్

వైభవంగా రథోత్సవం



చౌటుప్పల్ : రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో బుధవారం సీతారామ చంద్రస్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొబ్బిళ్ల మురళి, ధర్మకర్తలు కామిశెట్టి చంద్రశేఖర్, గుర్రం వెంకటేశం, పోలోజు శ్రీలత శ్రీనివాస్‌చారి, తూర్పాటి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి పట్టు వస్త్రాలు అందజేత



శ్రీరాంనగర్‌లో పట్టు వస్త్రాలను అందజేస్తున్న హిందూ దేవాలయ పరిరక్షణ సమితి సభ్యులు

యాదగిరిగుట్ట: పట్టణంలోని పలు కాలనీల్లో, యాదాద్రి కొండపై శివాలయంలో బుధవారం జరిగిన శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి హిందూ దేవాలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కట్టెగొమ్ముల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలోని యాదగిరిపల్లి, కొత్త గుండ్లపల్లి, పాత గుండ్లపల్లి, శ్రీరామ్ నగర్, గణేష్ నగర్, మైలార్‌గూడెం, బీసీ కాలనీ, అంగడి బజార్, ఎస్సీ కాలనీ (శ్రీలక్ష్మీ నగర్)లో నిర్వహించిన శ్రీ సీతారామచంద్ర స్వామివారి కల్యాణోత్సవంలో స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించామన్నారు. కార్యక్రమంలో కట్టెగొమ్ముల సుజాత, రాహుల్ రెడ్డి, కార్తీక్, వెంకటేష్, సాయి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి

చౌటుప్పల్ : కాంగ్రెస్ కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు బుధవారం చౌటుప్పల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. పార్టీలో చేరినవారిలో సిద్దిపేట శేఖర్‌రెడ్డి, హరిప్రసాద్, సుంకరి సత్యనారాయణ, రమేష్,దొడి వెంకటేశ్, గుండ్ల అనిల్‌కుమార్,బండారు రఘుపతి, తుంగ భూపాల్‌రెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లల మర్రి శ్రీనివాస్, ఎంపీటీసీ చిట్టంపల్లి శ్రీనివాస్, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోర దేవేందర్, నాయకులు ఉబ్బు వెంకటయ్య, కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ గౌస్‌ఖాన్, వీరమళ్ల సత్తయ్య పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్య తీసుకోవాలి

భువనగిరి రూరల్ : గురుకుల పాఠశాలల విద్యార్థులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం గురుకుల పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు చింతల శివ, లావుడ్య రాజు మాట్లాడుతూ పట్టణంలోని సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాలపై నిర్లక్ష్యం చూపిస్తున్న ఆర్‌సీఓ రజినిని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా మృతి చెందిన ప్రశాంత్ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఈర్ల రాహుల్, జిల్లా కమిటి సభ్యులు పుట్ట ఉదయ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

భువనగిరిటౌన్ : పట్టణంలోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని మృతిచెందిన విద్యార్థి ప్రశాంత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాలల హక్కుల సంఘం జిల్లా నాయకుడు కొడారి వెంకటేష్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీ రాందేవ్ లు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ప్రశాంత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘటనకు బాధ్యులైన భువనగిరి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్, వార్డెన్, సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బట్టు రామచంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కంచనపల్లి నర్సింగ్ రావు బిఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు బాసాని మహేందర్, బి ఆర్ ఎస్ పట్టణ సహాయ కార్యదర్శి గుండెబోయిన సురేష్ , గుండేబోయిన శంకర్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

భూదాన్‌పోచంపల్లి : భువనగిరి పట్టణంలోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని మృతిచెందిన మండలంలోని జిబ్లక్‌పల్లి గ్రామానికి చెందిన విద్యార్థి చిన్నలచ్చి ప్రశాంత్ కుటుంబానికి ప్రభుత్వం రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్నం శివకుమార్ మాట్లాడుతూ ప్రశాంత్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి అలాగే భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ సహకారంతో రూ. 20వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, చేనేత సెల్ జిల్లా కన్వీనర్ బస్వలింగం, పట్టణ అధ్యక్షుడు డబ్బీకార్ సాహేశ్, ప్రధానకార్యదర్శి ప్రభాకర్, మండల పార్టీ అధ్యక్షుడు గుండ్ల రాజు, ప్రధానకార్యదర్శి బైరు వెంకటేష్, చెక్క శ్రీను, గంగదేవి విజయ్, బడుగు శ్రీకాంత్, సైదుగాని లింగస్వామి, చేరాల లింగయ్య, మూటపురం రవి, జ్ఞానేశ్వర్, ఎర్ర లక్ష్మణ్, సాయికిరణ్, సతీష్, నరేందర్, ఉమాకాంత్, వంగూరి సిద్దు, ప్రవీణ్ పాల్గొన్నారు.



భువనగిరి క్రైమ్ : అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



భూదాన్‌పోచంపల్లి : అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ప్రశాంత్‌ది ప్రభుత్వ హత్యే

భువనగిరి క్రైమ్ : గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మృతిచెందిన ప్రశాంత్‌ది ప్రభుత్వ హత్యేనని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బుగ్గ దేవేందర్ ఆరోపించారు. బుధవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు దాసరి స్వామి, యువమోర్చ అధ్యక్షుడు పట్నం కపిల్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రత్నపురం బల్‌రాం , రాష్ట్ర అధికార ప్రతినిధి మేడి కోటేష్, కోళ్ల భిక్షపతి, ఎర్రవెల్లి నాగరాజు, రవికుమార్, జగన్‌మోహన్ రెడ్డి, రమేష్, కృష్ణాచారి, మల్లికార్జున్, నవీన్, పోళ్ల సుధాకర్, ఉషాకిరణ్, నరేష్ నాయక్ పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

భువనగిరిటౌన్ : పపట్టణంలోని భువనగిరి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థి ప్రశాంత్ మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కి నగేష్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థి మృతి కారణమైన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థి కుటుబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు.

సీపీఆర్ చేయగా కోలుకున్నట్టే కోలుకొని..

- గుండెపోటుకు గురైన వ్యక్తికి సీపీఆర్ చేసిన స్థానికులు
- అదుపులోకి వచ్చినట్టే వచ్చినప్పటికీ మళ్లీ అస్వస్థత
- హుటాహుటిన హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలింపు
- చికిత్స చేస్తుండగా మళ్లీ గుండెపోటుకు గురై మృతి



జెల్ల మురళి (ఫైల్)

చౌటుప్పల్ : పట్టణానికి చెందిన జెల్ల మురళి (49) మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే దారిలో కాంప్లెక్స్‌లో ఆటో మొబైల్ షాప్ నడుపుకుంటున్నాడు. అతనికి భార్య అరుణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రోజు మాదిరిగానే బుధవారం సైతం దుకాణం తెరిచి శుభ్రం చేశాడు. 11 గంటల ప్రాంతంలో షాపులో ఎలాంటి చప్పుడు లేకపోవడంతో పక్కనే ఉన్న మెకానిక్ రవి అనుమానించాడు. అన్నా అని పిలుచుకుంటూ లోనికి వెళ్లగా ఇబ్బందికరంగా వ్యవహరిస్తున్నాడు. కళ్లు తిరుగుతున్నాయని చెప్పడంతో పక్క దుకాణంలోకి తీసుకెళ్లి కూలర్ ఎదుట కూర్చోబెట్టాడు.ఆ తరువాత ఒక్కసారిగా కుప్పకూలాడు. అప్రమత్తమైన రవితోపాటు మరో యువకుడు పాషా వెంటనే సీపీఆర్ చేయడంతో రవి కళ్లు తెరిచాడు. అనంతరం అతన్ని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మలక్‌పేటలోని యశోద ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స నిర్వహిస్తుండగా రెండు మార్లు గుండెపోటు రావడంతో మృతిచెందాడు. సీపీఆర్ చేయగానే పరిస్థితి అదుపులోకి వచ్చినట్టే వచ్చి.. ఆస్పత్రిలో చికిత్స చేస్తుండగా మళ్లీ గుండెపోటుకు గురై మృత్యువాత పడ్డాడు. మృతుడు మంగళవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకున్నాడు. అక్కడే చికిత్స పొందాల్సి ఉన్నప్పటికీ రెండు రోజుల తర్వాత వెళ్దామనుకున్నాడు. ఒక్కరోజు వ్యవధిలోనే మృతిచెందాడు. అక్కడ చికిత్స పొందినా ప్రాణాలు దక్కేవని కుటుంబసభ్యులు, స్నేహితులు విలపించారు.

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి

ఆలేరురూరల్ : ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ అన్నారు. మండలంలోని మంతపురి గ్రామంలో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా వేతనాలు అందక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఉపాధిహామీ కూలీలకు చెల్లించాల్సిన వేతనాలు చెల్లించాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఉపాధిహామీ పనిప్రదేశంలో మంచినీరు, టెంట్ మెడికల్ కిట్టు అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పల్లె శ్రీనివాస్, బీరయ్య, శ్రీశైలం, పరుశరాములు పాల్గొన్నారు.